క్లుప్తంగా

వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: వీధి వ్యాపారరును ప్రధానమంత్రి స్వనిధి పథకంలో చేర్చి, ఆర్థికంగా అభివృద్ధి పర్చడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో లోక కల్యాణ మేళా, వీధివ్యాపారులైన మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పీఎం స్వనిధి కింద అర్హులైన వారందరికీ రుణసదుపాయం అందించి వారి వ్యాపారాభివృద్ధికి దోహదపడటమే కార్యక్రమ ఉద్దేశమని మెప్మా జిల్లా అధికారి ఎస్.వి.ప్రసన్నబాబు, టీఎంసీ కెరణ్ తెలిపారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, వైద్యులు మల్లికార్జున తదితరులు మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిదేవి, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా



బోల్తా పడిన సిమెంట్ లారీ

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని బొందలవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి, సిమెంట్ లారీ బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. తాడిపత్రి నుంచి బెంగళూరుకు సిమెంట్‌తో లారీ వెళ్తోంది. బొందలవాడ సమీపంలోకి రాగానే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్ల వల్ల ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఆఖరి నిమిషంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. అయితే లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



ఓబులేసు(ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ వీఆర్‌ఏ ఓబులేసు(58) అనారోగ్య సమస్యలతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు మూడు రోజుల క్రితం ఓబులేసును చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉపకరణాల పంపిణీకి నేడు దివ్యాంగుల ఎంపిక

గుంతకల్లు రూరల్: మండలంలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని పాఠశాలల్లో నమోదైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు పంపిణీలో భాగంగా ఈ నెల 24న స్థానిక మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో ఎంపిక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓ మస్తాన్ రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ నమోదు ఎంపిక కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'శక్తి యాప్' మహిళలకు రక్షణ కవచం



మాట్లాడుతున్న సీఐ మనోహర్

గుంతకల్లుటౌన్: మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం లాంటిదని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్ తెలిపారు. మంగళవారం ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ఆడిటోరియంలో కళాశాల మహిళా సాధికార కమిటీ ఆధ్వర్యంలో శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ ఉన్న మహిళలు తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. శక్తి టీమ్ ఏఎస్ఐ పద్మావతి, కానిస్టేబుల్ మునెమ్మ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, పీఎం ఉషా కోఆర్డినేటర్ రవిశంకర్ శర్మ, మహిళా సాధికార కమిటీ కోఆర్డినేటర్ వాణిశ్రీ, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ..విద్యార్థులకు శాపం!



పామిడిలో కిక్కిరిసిన బస్సులో ఎక్కేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు



కళాశాలకు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

పామిడి: ఉచిత బస్సు పథకం విద్యార్థులకు శాపంగా మారింది. పామిడి నుంచి అనంతపురానికి వెళ్లి చదువుకునే విద్యార్థులు ఉచిత బస్సు పుణ్యమా? అంటూ నరకం చూస్తున్నారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది. అయితే బస్సు సర్వీసులను పెంచడం మరిచింది. ఇది అనంతపురం వెళ్లి చదువుకునే విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఒకవేళ బస్సు వచ్చినా ప్రయాణికులతో కిక్కిరిసి ఉండడంతో విద్యార్థులకు నరకం చూపిస్తోంది. పామిడి నుంచి రోజూ పామిడి, కల్లూరు గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులు అనంతపురంలోకి కళాశాలలకు వెళ్లి వస్తుంటారు. అందులో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతరత్రా విద్యనభ్యసించే విద్యార్థులే అధికం.

విద్యార్థులకు అవస్థలు

రోజూ ఉదయాన్నే కళాశాలకు వెళ్లే విద్యార్థులతో పామిడి కిటకిటలాడుతుంటుంది. ఉచిత బస్సుల కారణంగా సర్వీసుల పెంపు నోచుకోకపోగా, పల్లె వెలుగు బస్సులు బ్రేక్ డౌన్ అయినప్పుడు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో విద్యార్థులకు కాంబినేషన్ టికెట్ కింద పది రూపాయలు వెసులుబాటు ఉంది. ఈ విషయాన్ని విద్యార్థులంతా కలసి ఇటీవల కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఫలితంగా కండెక్టర్లు సైతం బస్సుల్లోకి విద్యార్థులను అనుమతించకపోవడంతో.. విద్యార్థుల ఆవేదన అరణ్య రోదనైంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి బస్సు సర్వీసుల పెంపుతో పాటు కాంబినేషన్ టికెట్‌తో ప్రయాణాన్ని అనుమతించేలా చర్యలు చేపట్టి పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్/యాడికి/యల్లనూరు: గ్రామ పంచాయతీల పురోగతిపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సూచించారు. గుత్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఏఎస్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాల విద్య, గ్రామాల్లో అక్షరాస్యత, ఆహార, ప్రజా పంపిణీ, వ్యవసాయ శాఖ, ఆరోగ్యం, కుటుంబ సక్షేమం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, ఏపీఓ రమేష్, వైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఏపీఎం అరుణకుమారి, కార్యదర్శులు బాషా, వెంకటేష్, ధనలక్ష్మి, సర్పంచ్‌లు రమేష్‌బాబు, పాపన్న, బేడల లక్ష్మిదేవి, గురుమస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ శశికళ నిర్వహించారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఏఓ నాగేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటనాయుడు, పలు శాఖల అధికారులు సర్పంచులు పాల్గొన్నారు. అలగే యల్లనూరు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచు, మండల లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కరుణసాగర్, ఎంపీటీసీ ఆదినారాయన రెడ్డి, సర్పంచు పెద్ద నాగరాజు, ఉప సర్పంచు బాస్కర్ రెడ్డి, తహసల్దార్ రాము, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర రెడ్డి, హౌసింగ్ ఏఈ సుప్రజ, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజమణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో క్యాన్సర్ ముప్పు



వైద్యురాలు కుముదను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రస్తుత జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగా క్యాన్సర్లకు కారణాలుగా మారుతున్నాయని శ్రీ శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రభుత్వాస్పత్రి డాక్టర్ కుముద అన్నారు. మంగళవారం కళాశాలలో ఇన్నర్ వీల్ క్లబ్, కళాశాల మహిళ సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా (సర్వైకల్) క్యాన్సర్ కారణాలు, జాగ్రత్తలపై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కందూరి సునీత, సభ్యులు ఇందిర, పద్మ, లక్ష్మీజ్యోతి, శాంత, కళాశాల మహిళ సాధికారత విభాగం కన్వీనర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ సుభాషిని, మైమున్, వరలక్ష్మి, సౌజన్య, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో మేటి భారతి సిమెంట్



కల్లూరులో తాపీ మేస్త్రీలకు ఉచితంగా ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: భారతి సిమెంట్ నాణ్యతలో మేటిగా ఉందని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్ నాయక్ అన్నారు.మంగళవారం మండలంలోని కల్లూరులో రంగనాయక ఐరన్‌మార్ట్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ నాణ్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సిమెంట్ తయారీ రంగంలో భారతి సిమెంట్ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర సిమెంట్లతో పోల్చుకుంటే భారతి సిమెంట్ మెరుగైందన్నారు. అందువల్లే వినియోగదారులు భారతి సిమెంట్ వాడేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. రోబోటిక్ క్వాలిటీ, జర్మనీ టెక్నాలజీ, టాంపర్‌ప్రూఫ్ ప్యాకింగ్ వంటి అత్యున్నత ప్రమాణాలతో భారతి సిమెంట్ అందజేస్తున్నామన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల విలువ చేసే ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ డీలర్ భాస్కర్‌రెడ్డి, భారతి సిమెంట్ మార్కెటింగ్ ఆఫీసర్ మల్లికార్జున పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోండి

గుంతకల్లు: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకొని రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీపీఐ నాయకుల బృందం కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. పట్టణంలోని ప్రధాన రహదారిని వెడల్పు చేయడంతో ద్వారా వాహనాల రాకపోకలకు సులభతరం కావడంతోపాటు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారిలోని డ్రైనేజీలను శుభ్రం చేయించాలన్నారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పట్టణంలో కుక్కల బెడద నివారణకు కుక్కల శాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బి.మహేష్, పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దేవేంద్ర, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'గేట్స్'లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

గుత్తి: గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం మానవతా బ్లడ్ డోనర్స్ సంస్థ, అనంతపురం ప్రభుత్వాసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గుత్తి ప్రభుత్వాస్పత్రి వైద్యుడు ఎల్లప్ప, గేట్స్ కాలేజీ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ మాట్లాడారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులందరూ ప్రతి మూడు మాసాల కొకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మానవతా బ్లడ్ డోనర్స్ సంస్థ ప్రతినిధి అమర్‌నాథ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో మహిళల ఆరోగ్యంపై బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవేంద్రనాయక్, ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధి, మానసిక రోగాలలకు సంబంధించి 106 మంది మహిళలకు వైద్యాధికారులు వివిధ రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధారాణి, సూపర్‌వైజర్లు రెడ్డమ్మ, లాజరస్, ఏఎన్ఎంలు లక్ష్మీకాంత, మాధవి, కవిత లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు త్రివేణి, ఆంజనేయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని ముప్పాలగుత్తి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(38) చికిత్స పొందుతూ మంళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ ఈ నెల 18న రాత్రి క్రిష్టిపాడు వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా.. గ్రామ సమీపంలో బండల లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గుంతకల్లులో మహాగౌరిగా వాసవీ మాత



గుంతకల్లులో గాయత్రీ దేవిగా అమ్మవారు




గుంతకల్లులో కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారు



సేవాఘడ్‌లో గాయత్రి దేవిగా జగదాంబ



పెద్దపప్పూరులో అన్నపూర్ణేశ్వరిగా చౌడేశ్వరి



కల్లూరులో సత్యనారాయణ స్వామి అలంకరణలో ..



తాడిపత్రిలో రాజరాజేశ్వరీదేవి అలంకరణ



తాడిపత్రిలో దుర్గామాత



శింగనమలలో దుర్గాదేవి



గుత్తిలో వాసవీ మాత



పామిడిలో అన్నపూర్ణ దేవిగా వాసవీమాత



బీకేఎస్‌లో గాయత్రీ దేవిగా పెద్దమ్మ తల్లి

దుర్గామాతా.. శరణు

సాక్షి నెట్‌వర్క్: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వాసవీ మాతను మహాగౌరిగా, గాయత్రిదేవి అలంకరణలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయాల వద్ద అన్నదానం చేశారు.



యాడికిలో పుట్ట మన్ను తీసుకుంటున్న ఆర్య వైశ్యులు



యాడికిలో పెద్దమ్మ తల్లి దర్శనం

పరామర్శ



బాబుతో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బాబును ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనిదల రమేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల టీడీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను రమేష్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీసారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వా రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

శుభకార్యం

పామిడి: పట్టణంలోని రహమత్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం స్థానిక నగర పంచాయతీ ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు అబుసాలేహా కుమారుడి వివాహ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె వధూవరులను దీవించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు మిడుతూరు రామచంద్ర, సీనియర్ నాయకుడు చుక్కలూరు రామకృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎన్ మహమ్మద్ గౌస్, ఆర్‌టీఐ విభాగం పట్టణ ఉపాధ్యక్షుడు కే మహబూబ్‌బాషా, ఆదాం, బొల్లు వెంకట్రామిరెడ్డి, చాకలి సుంకన్న, నీలకంఠారెడ్డి, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా



వాహనదారులను హెచ్చరిస్తున్న ఎస్ఐ

పెద్దపప్పూరు: ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే రూ.1000 జరిమానా విధించనున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని చిన్నపప్పూరు, చాగల్లు, గార్లదిన్నె, చీమలవాగుపల్లి, ముచ్చుకోట గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో వాహనాలు తనిఖీ చేసి హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోతే తొలివిడత రూ.300, రెండో విడత రూ.600, మూడో విడత రూ.1000 జరిమానా విధిస్తామని, ఆపై పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.

'ఉపాధి' సమావేశాలపై సిబ్బంది నిర్లక్ష్యం..

పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమావేశంలో కూలీల హాజరు, వేతనాలు, పనుల పురోగతి, కొత్త డిమాండ్లు, సాంకేతిక సమస్యలు, కూలీల సమస్యలతో పాటు ఉపాధి హామీ ఉన్నతాధికారుల సూచనలపై మండల స్థాయి అధికారులు సిబ్బందికి సూచనలు అందిస్తారు. అయితే కొందరు తమకు రాజకీయ పలుకుబడి ఉందనే ధీమాతో సమావేశాలకు తరచూ డుమ్మా కొడుతున్నట్లు చర్చ జరుగుతోంది. గత నెలలో సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్లు రాకపోవడం, వచ్చినా అసలు వారి స్థానంలో బినామీలు రావడంపై ఓ అధికారిణి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం సక్రమంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారుచేద్దాం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున

శింగనమల: ఓటరు జాబితా తప్పులు లేకుండా అందిద్దామని, ఇందుకు రాజకీయ పార్టీల నాయకులు సమకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ హబీబీ, సీనియర్ అసిస్టెంట్ పాల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వీ నారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈ– పంట నమోదు తప్పనిసరి

గుంతకల్లు రూరల్/యాడికి: ఈ -పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు, పంట నష్ట పరిహారం అందుతుందని ఏఓ లీనా వసుంధర తెలిపారు. మంగళవారం మండలంలోని నక్కనదొడ్డి, తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన ఏఓ రైతులు సాగు చేసుకున్న పంటలను పరిశీలించి, ప్రతి ఒక్కరూ ఈ నెల 30లోగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. గడచిన మూడు రోజుల వ్యవధిలో మండల వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా 94.5 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. అలాగే యాడికి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, సహాయ కార్యదర్శి శ్రీనివాసనాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా, డీఏపీ పంపిణీ

పుట్లూరు: మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం యూరియా, డీఏపీ పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి కాత్యాయని తెలిపారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేస్తున్నామన్నారు. యూరియా 45 కిలోల బస్తా రూ.266.50, డీఏపీ 50 కిలోల బస్తాకు రూ.1350 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ రవితేజ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జయరాం బైక్‌లో వస్తుండగా అదుపు తప్పి కింద పడి గాయపడ్డాడు. వివరాలు.. మంగళవారం వ్యక్తిగత పనిమీద ఆయన నార్పలకు వెళ్లి తిరిగి వస్తుండగా, గ్రామ సమీపంలోకి రాగానే తన ఇద్దరు కూతుర్లు ఇద్దరు, కుమారుడు కనిపించారు. వారిని బైక్‌లో ఎక్కించుకుని ఇంటికి వస్తుండగా.. బైక్ అదుపు తప్పింది. ఘటనలో జయరాంకు తీవ్ర గాయలు కాగా, చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన జయరాంను బంధువులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

సంక్షిప్త సమాచారం

బైక్‌ను ఢీ కొన్న లారీ

గుత్తి: పట్టణంలోని మస్రో సత్రం సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కోట వీధికి చెందిన వెంకటేష్ బైక్‌లో కర్నూల్ రోడ్డు వైపు వెళుతుండగా లారీ ఢీ కొనింది. ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనాథలకు నిత్యవసరాల అందజేత

పామిడి: మూడురోజుల క్రితం తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన నిరుపేద పసిపిల్లలకు మంగళవారం నిత్యవసరాలు అందజేసి పామిడి పట్టణానికి చెందిన ఉత్తకర్ మంజునాథ్ మిత్ర బృందం మానవత్వాన్ని చాటారు. చిలమత్తూరులో మూడురోజుల క్రితం ఒక నిరుపేద కుటుంబం తమ తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో ఆ కుటంబంలోని పసిపిల్లలు రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న పామిడి మంజునాథ్‌రావు మిత్రబృందం అనాథలైన ఆ పసిపిల్లలకు నిత్యవసర సరుకులు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మిత్రబృందం టీటీ అశోక్‌రావు, ప్రకాష్, రవిగంగ, జగదీష్, నరేష్, పణిరాజ్, గణేష్, వడ్డే రాజ్ కుమార్, హరేంద్రబాయ్, భవాని ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.